పోచమ్మమైదాన్: దేశాయిపేటలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న మేయర్ సుధారాణి-ప్రభాకర్ దంపతులు

పోచమ్మమైదాన్: దేశాయిపేటలో సాయిబాబాకు అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

నర్సంపేట: సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

దుగ్గొండి: మండలకేంద్రంలో సాయిబాబా చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

- **సాయిబాబా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు**
- **పండ్లు, ఫలాలతో నైవేద్యం సమర్పించిన భక్తులు**
- **మార్మోగిన బాబా నామస్మరణ**

నర్సంపేట/దుగ్గొండి, జూలై 3: గురుపౌర్ణమి వేడుకలను సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు పండ్లు, ఫలాలతో నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు సాయిబాబా నామస్మరణతో మార్మోగాయి. నర్సంపేటలోని సాయిబాబా ఆలయం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో సందడిగా మారింది. భక్తులు సాయిబాబాకు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. కొందరు భక్తులు ఆలయ హుండీలో కానుకలు వేశారు. నిర్వాహకులు మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతరం ఆలయంలో భజన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిసిపోయాయి. దుగ్గొండి మండలకేంద్రంలో సాయి సేవా సమితి సంస్థ ప్రతినిధి దేవులపల్లి సదానందం ఆధ్వర్యంలో, నాచినపల్లి సీతారామచంద్రస్వామి ఆలయంలోని సాయిబాబా మందిరంలో, కేశవాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలోని సాయిబాబా మందిరంలో సాయి సేవా సమితి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, ఎన్నారై రాజ్‌కుమార్, తోకల నర్సింహారెడ్డి, యాదగిరి సుధాకర్, కూస రాజు, కూస సుమన్, జక్కుల రాజమౌళి, రాంబాబు, సదానందం, భక్తులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పోచమ్మమైదాన్: సప్తధామంలో వేలాదిగా పాల్గొన్న భక్తులు

సాయిబాబాకు భక్తుల పూజలు

గిర్మాజీపేట/కాశీబుగ్గ: వరంగల్ 25వ డివిజన్‌లోని శివ సాయి మందిరానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నేత బస్వరాజు శ్రీమాన్ ప్రారంభించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ బస్వరాజు కుమార్, జనగాం రాము, చాగంటి శ్రీనివాస్, ఎండీ మస్తాన్, బండారి సదానందం, కొల్లూరి మల్లేశ్, బస్వరాజు సాంబయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, 28వ డివిజన్ పాతబీటుబజార్‌లో కార్పొరేటర్ గందె కల్పన బాటసారులకు అన్నదానం చేశారు. కాశీబుగ్గ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, చండీయాగం, మూలనక్షత్రాన్ని పురస్కరించుకొని అన్నపూర్ణాదేవికి అభిషేకం, శాకంబరీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ బయ్యాస్వామి, వైకుంఠం, కృష్ణమూర్తి, రాజు, భాస్కర్, ఓంకారేశ్వర్, దయాసాగర్, శ్రీరాం, సారంగపాణి, అమ్మిరెడ్డి, సునీత, శ్రీనివాస్, సతీశ్, శ్రీలత, రజిత పాల్గొన్నారు. అంతేకాకుండా ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. సురేశ్, సమ్మక్క, సృజన, రోజా, కవిత, మాటమ్ శ్రీనివాస్, నీలం శ్రీనివాస్, విరాట్ ప్రకాశ్‌రెడ్డి, భాస్కర్, విక్కి పాల్గొన్నారు.

పరమశివుడు ఎంతో మార్గదర్శకం

పోచమ్మమైదాన్: పరమశివుడు భక్తులకు ఎంతో మార్గదర్శకంగా ఉంటూ సత్ఫలితాలు అందిస్తారని సినీనిర్మాత కందుకూరి రాజశేఖర్ అన్నారు. ములుగురోడ్డులోని సప్తధామంలో గురుపౌర్ణమి వేడుకలను పూజ్య శివానందమూర్తి గురువు సన్నిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివుడిని భక్తులు అమితమైన భక్తిశ్రద్ధలు, నియమనిష్టలతో పూజిస్తే.. ఆయన గురువుగా ఉంటూ భక్తుల కోరికలు తీర్చుతారన్నారు. ఈ సందర్భంగా దేశవిదేశాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు భక్తిపారవశ్యంతో పరవశించిపోయారు. న్యాయవాది అహ్మద్ బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. అలాగే, కరీంనగర్ నుంచి వచ్చిన భక్తురాలు శ్రీకుమారి పాడిన భక్తిపాట ఆకట్టుకుంది. కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ డీజీపీ ఆర్.కె.నరేందర్, విజిలెన్స్ కమిషనర్ గోపాల్‌రెడ్డి, రిటైర్డ్ ఎస్పీ అశోక్, సినీనటులు రాధాకుమారి, వేణుగోపాల్, శివానంద కల్చరల్ ట్రస్ట్ ప్రతినిధులు త్రిపురనేని గోపీచంద్, సాయినారాయణ, ఉమాశంకర్, సోమరామయ్య, సదాశివుడు, విజయ్‌కుమార్, కల్యాణ్‌రామ్, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

దేశాయిపేట సాయిబాబా ఆలయంలో..

దేశాయిపేటలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో సాయిబాబాకు విశేష పూజలు జరిపారు. ఆదివారం సాయంత్రం 6 నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు ఏకధాటిగా 24 గంటలపాటు అఖండ సాయి నామస్మరణ చేశారు. అలాగే, నగర సంకీర్తన, కాకడ హారతి, 501 కలశాలతో విశేష అలంకరణ, అర్చన, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీసేవ, పోచమ్మమైదాన్ సెంటర్ నుంచి దేశాయిపేట సెకండ్ బొడ్రాయి వరకు ప్రత్యేక కోలాట బృందం మధ్య పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి-ప్రభాకర్ దంపతులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గిర్మాజీపేట: భక్తులకు అన్నం వడ్డిస్తున్న బీఆర్ఎస్ నేత బస్వరాజు శ్రీమాన్

సాయి సేవాదళ్ ఆధ్వర్యంలో..

ఎల్లంబజార్‌లోని సాయిసేవాదళ్ భజన మందిరిలో సాయి సేవాదళ్ ఆధ్వర్యంలో సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాలు పూలు, పండ్లతో సాయినాథుడికి ప్రత్యేక అభిషేకం చేశారు. అలాగే, ఓంసాయి శ్రీసాయి జయజయసాయి ఏకనామ యజ్ఞం, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆరుట్ల శ్రీనివాస్, మన్నవ మోహన్ కృష్ణ, పోలా మహేశ్‌స్వామి, యిరుకుళ్ల నాగేశ్వర్‌రావు, వేముల శ్రీనివాస్, కొడితాల శికుమార్, సాయిసేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీశృంగేరి శంకరమఠంలో..

వరంగల్ శ్రీనివాసకాలనీలోని శ్రీశృంగేరి శంకరమఠంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి గురుపాదుక పూజ, రుద్రాభిషేకం జరిపారు. అలాగే, భక్తుల సమక్షంలో రమా సహిత సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించి, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ గావించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సంగమేశ్వర జోషి తెలిపారు. అలాగే, ములుగురోడ్డులోని దత్తక్షేత్రంలో వేడుకలను వైభవంగా నిర్వహించారు.

మొక్కల కోసం దరఖాస్తు చేసుకోవాలి

నర్సంపేటరూరల్, జూలై 3: మండలంలోని 27 గ్రామాల్లో హరితహారం మొక్కల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నసన్నకారు రైతులు మొక్కలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మొక్కలు అందిస్తుందన్నారు. మామిడి, నారింజ, నిమ్మ, జామ, సపోట, సీతాఫలం, ఆపిల్‌బేర్, దానిమ్మ, కొబ్బరి, మునగ, చింత, నేరెడు, ఆయిల్‌పాం మొక్కలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మొక్కలను బాధ్యతగా పెంచి సంరక్షించాలన్నారు. ఆయన వెంట ఎంపీవో అంబటి సునీల్‌కుమార్‌రాజ్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు సంతోష్‌బాబు, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

దుగ్గొండి, జూలై 3: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్సై వంగల నవీన్‌కుమార్ సూచించారు. గిర్నిబావిలో ఎస్సై సిబ్బందితో కలిసి సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. ప్రతి వాహనదారుడు విధిగా పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపిన, హెల్మెట్ లేని వారికి ఎస్సై జరిమానా విధించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

నేడు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక

ఖానాపురం/నర్సంపేటరూరల్, జూలై 3: హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాలకు బుధరావుపేట మోడల్ స్కూల్‌లో మంగళవారం ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు ఎంఈవో రత్నమాల తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట వయస్సు, విద్య, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు, పది పాస్‌ఫోటోలు, 3, 4వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టులు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను తేవాలని కోరారు. విద్యార్థులకు ఎత్తు, బరువుతోపాటు పరుగు పందెం పోటీలను నిర్వహించి మండలస్థాయిలో 20 మంది బాలురు, 20 మంది బాలికలను ఎంపిక చేస్తారని తెలిపారు. ఇక్కడ ఎంపికైన వారికి ఈ నెల 11, 12, 13వ తేదీల్లో వరంగల్ ఓసిటీలో జిల్లాస్థాయిలో ఎంపిక పరీక్షలు నిర్వహించి, అక్కడ ఎంపికైన విద్యార్థులకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

రేపు జడ్పీహెచ్ఎస్(బాలుర)లో..

నర్సంపేటరూరల్/చెన్నారావుపేట: నర్సంపేట మండలస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలను పట్టణంలోని జడ్పీహెచ్ఎస్(బాలుర)లో ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ఎంఈవో రత్నమాల తెలిపారు. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం 3వ తరగతిలో ఉత్తీర్ణులై, ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులన్నారు. విద్యార్థులు 01.09.2013 నుంచి 31.08.2014 మధ్యలో జన్మించిన ఉండాలన్నారు. మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. అలాగే, హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం మండలస్థాయిలో ఎంపిక పరీక్షలను బుధవారం చెన్నారావుపేట మండలం జల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో రత్నమాల తెలిపారు. ఈ అవకాశాన్ని చెన్నారావుపేట మండలంలోని అర్హులైన విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

'ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి'

నర్సంపేట, జూలై 3: ఎస్సీ వర్గీకరణను చేపట్టాలని మాదిగ స్టూడెంట్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ కోరారు. సోమవారం నర్సంపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో శివకుమార్, వీరేశ్, యాకూబ్, జాంబవ, బాబు పాల్గొన్నారు.

గోరింటాకు పెట్టుకున్న మహిళలు

పాకాల మహిళా బ్యాంకులో గోరింటాకు పండుగ

నర్సంపేట, జూలై 3: ఆషాఢమాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని పాకాల మహిళా బ్యాంకు అధ్యక్షురాలు పెండెం రాజేశ్వరి అన్నారు. పట్టణంలోని పాకాల మహిళా బ్యాంకులో సోమవారం గోరింటాకు పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. గోరింటాకు ఎర్రగా పండితే సకల శుభాలు కలుగుతాయని నమ్ముతారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఇమ్మడి పద్మ, రాపాక మాణిక్యం, గాదగోని నిర్మల, మండల పద్మ, గండు శ్రీదేవి, దేవులపల్లి వాణి, నల్ల భారతి, గుర్రపు అరుణ, గిరగాని హైమావతి, సామల ఉమ, పీ అనిత, హైమావతి, స్పందన, జానకమ్మ పాల్గొన్నారు.

ముగ్గురు వాహనదారులకు జరిమానా

పోచమ్మమైదాన్, జూలై 3: వరంగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ. 25,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ బాబూలాల్ సోమవారం తెలిపారు. అలాగే, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 29 మందికి రూ. 43,000 జరిమానా విధించారన్నారు. మరో ఇద్దరికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.